9న పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 9న పార్వతీపురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహిదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న స్థానికజూనియర్ కళాశాలలో జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వివిధ ఫార్మా సంస్థల్లో సుమారు 85 ఖాళీలను భర్తీ చేయాలని జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు www.ncs.gov.in వెబ్‌సైట్‌లో జాబ్ సీకర్ లాగిన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థులు తమ బయోడేటా, రెండు పాస్ సైజ్ ఫోటోలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు.

దేశభక్తి గల ప్రజలు సమ్మెలో పాల్గొనాలి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపు

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశభక్తి గల ప్రజలంతా దేశ సార్వత్రిక సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ కార్మిక, ప్రజలకు పిలుపునిచ్చారు. జాతీయ సమ్మె సందర్భంగా సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోడీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక హక్కులను హరించడమే లక్ష్యంగా కంకణం కట్టుకున్నారని, దాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం దేశ సర్వసంపదలను కారుచౌకగా తాకట్టు పెడుతుందని తెలిపారు. బిజెపి పాలన మొత్తం కార్పొరేట్లకు వరాలు, ప్రజలపై భారాలుగానే కొనసాగుతుందని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోడీ మెప్పు కోసం కార్పొరేట్ల బాటలోనే పయనిస్తుందని, దేశంలో ఎక్కడా అమలు కాని నాలుగు లేబర్ కోడ్ల అమలు, పని గంటల పెంపు వంటి చర్యలు చేపడుతుందని, ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సమ్మె చేపడుతున్నాయని అన్నారు. ఇందులో ప్రధానంగా స్కీం వర్కర్ల అంగన్‌వాడీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచాలని, కూలీల బకాయిలు చెల్లించాలని, ఉపాధి హామీ పనిని పట్టణాలకు విస్తరింప చేయాలని, రైతు పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర భద్రత చట్టం చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, పెంచిన పనిగంటలను తగ్గించాలని, పెరుగుతున్న ధరలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, పన్నుల భారాన్ని తొలగించాలని, డిమాండ్ చేశారు. ఇప్పటికే సమ్మె జయప్రదం కోసం వామపక్షాలతో పాటు రైతులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రత్యక్షంగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని, దేశభక్తి గల ప్రజానీకం జాతీయ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, బి.వి.రమణ, బి.సూరిబాబు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

పాలకొండ : ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పాఠశాల శానిటేషన్, మధ్యాహ్నం భోజన కార్మికులు సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల అధ్యక్షులు బి అమరవేణి, మధ్యాహ్నం భోజన పథకం నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక కర్షక సార్వత్రిక సమ్మెలో భాగంగా మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్స్ స్వీపర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, స్కూల్స్ స్వీపర్ల సంఘం నాయకులు కె.గౌరమ్మ, ఆర్.సావిత్రి, కె.దుర్గమ్మ, బి.చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఈనెల 9న జరగబోయే సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్,రాము, మధ్యాహ్న భోజన పథకం సంఘం జిల్లా కార్యదర్శి ఇ.శాంతి కుమారి, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సమ్మె జయప్రదం కోరుతూ కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ ప్రచారం మండలంలోని తామరకండి, గెడ్డలుప్పి, చినబోగిలి, బూర్జ, లక్ష్మీపురం, చెల్లంనాయుడు, నిడగల్లు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఎస్.శంకర్రావు, కృష్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : ఈనెల 9న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, బి.లక్ష్మి, ఆర్.శ్రీదేవి, పి రాజశేఖర్ ప్రచారం నిర్వహించారు. ఈనెల 9న జరుగు దేశ వ్యాప్త సమ్మెలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కొమరాడ : ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు కొమరాడలో గల వ్యాపారస్తులతో సమ్మె సహకరించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, భవన కార్మికుల సంఘం నాయకులు గౌరు నాయుడు తదితరులు ఉన్నారు.

సాలూరురూరల్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని ఎంఇఒకు సమ్మె నోటీసులను కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు రేవతి, సుహాసిని, గాయత్రి, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

వీరఘట్టం : ఈనెల 9న జరుగు సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో ఎంఇఒకు మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నాయకులు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి ఎన్.ప్రసాద్ రావు, మధ్యాహ్న భోజన కార్మికసంఘం నాయకులు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు ఇస్తోందని గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల ఎస్ఎఫ్ఐ కార్యదర్శులు ఆరికి గంగారావు, బిడ్డిక అనిల్ తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులకు, ఇతర సామాన్య ప్రజలకు నష్టం చేకూర్చేలా ఉన్నాయని అన్నారు. ఈ విధానాలకు నిరసనగా సమ్మెలో ఎస్ఎఫ్ఐ భాగస్వామ్య కానున్నట్టు తెలిపారు.

బలిజిపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు

సమ్మెను జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ

బలిజిపేట : కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీసవేతనం అమలు చేయాలని కోరుతూ ఈనెల 9 జరుగు దేశవ్యాప్త సమ్మెజయప్రదం చేయాలని బలిజిపేటలో బైక్ ర్యాలీ సోమవారం నిర్వహించారు. ఈ ర్యాలీని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గంట్యాడ బలరాం నాయుడు, త్రినాధరావు, వెంకటస్వామి, డేవిడ్, సింహాచలం, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూడి- కేరంగి మీదుగా మెలికంచూరు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఇక డోలి మోతలు ఉండవు : మంత్రి

రూ.6 కోట్లతో పూడి-కేరంగి-మెలికంచూరు రహదారి ప్రారంభం

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన ప్రాంతాల్లో ఇక్కపై డోలిమోతలు ఉండవని, ఈ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పూడి నుండి కేరంగి మీదుగా మెలికంచురు వరకు నిర్మించిన 8 కిలోమీటర్ల రహదారిని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం పూడిలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. రూ.6కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ రోడ్డును నిర్మించినట్టు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఐదు పంచాయతీలకు సంబంధించి 20 గిరిజన గ్రామాలు ప్రత్యక్ష లబ్ధిదారులవుతాయని, డోలిమోతల సమస్యకు ఈ రహదారి శాశ్వత పరిష్కారంగా మారుతుంది అన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు వేసి డోలి మోతలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, పక్కా రహదారి లేక గర్భిణులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తనకు తెలుసునన్నారు. ఏడాది పాలనలో 650 గిరిజన గ్రామాలకు రూ.1300 కోట్లతో పక్కా రహదారులు వేశామని, అలాగే 1600 గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. పాచిపెంట మండలానికి మరో రూ.20 కోట్లతో రోడ్లు వేస్తామన్నారు. పాచిపెంట, మక్కువ, సాలూరు మండలాలకు 300 గోకులాలు మంజూరు చేస్తామన్నారు. రోడ్ల నిర్మాణంతో గిరిజన గ్రామాల అభివృద్ధికి నాందని, ముఖ్యంగా విద్య, వైద్యం, రవాణా, ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కావడంతో గ్రామాల అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిఎ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిఇలు, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ. మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, చల్లా కనక, కె.సురేష్, మాతల బలరాం, కొత్తల పోలినాయుడు, పూసర్ల నర్సింగరావు, కె.సింహాచలం, నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక సబ్ జైలును సోమవారం జిల్లా న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు కె.హరిబాబు ఆకస్మిక తనఖీ చేశారు. ఖైదీలకు వసతి సదుపాయాలు, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాలకొండ మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు సి.హెచ్ హరిప్రియ, న్యాయవాదులు సింహాచలం, ఎం.వెంకటేశ్వరరావు, ఆనందరావు, సబ్ జైలు అధికారి బి.జోగులు పాల్గొన్నారు

అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు హితవు పలికారు. సమస్య పరిష్కారంతో అర్జీదారులకు మేలు జరిగాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉపకలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 109 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో 48 గంటల్లోగా పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎస్‌పి కార్యాలయంలో....

పార్వతీపురం టౌన్ : ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ మాధవరెడ్డి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 16ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ సిఐ ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్ కు 43 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 43 మంది వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చినబాబు, డిడి అన్నదొర, ఇఇ కుమార్, డిప్యూటీ డిఇ రామ్మోహనరావు, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, వెలుగు ఎపిడి, పిహెచ్ఒ గణేష్, డిప్యూటీ డిఎంహెచ్వో విజయ పార్వతి, వ్యవసాయ అధికారి వాహిని, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాధ విద్యార్థినికి దక్కని 'తల్లికి వందనం'

పట్టణంలోని నాలుగో వార్డు భారత్ భవనం వీధికి చెందిన విద్యార్థిని మజ్జి దేవీ ప్రసన్నకు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన తల్లికి వందనం దక్కలేదు. దేవీ ప్రసన్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల జ్యోతిరావుపూలే బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి శ్రీనివాసరావు 2013లో మరణించారు. తల్లి మజ్జి కుసుమ కోవిడ్‌తో 2021లో మరణించారు. తల్లిదండ్రులు లేని దేవీప్రసన్న బంధువుల సంరక్షణలో చదువుతోంది. కోవిడ్ సమయంలో తల్లి మరణించడంతో అనాధగా మిగిలిన విద్యార్థిని దేవీ ప్రసన్నను అప్పటి జిల్లా కలెక్టర్ సూర్యకుమారి నెల్లిమర్ల జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో సీటు ఇప్పించారు. అప్పటి నుంచి అక్కడే చదువుతున్న దేవీప్రసన్నకు వైసిపి ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద డబ్బులు మంజూరయ్యాయి. టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం కింద అనాధ విద్యార్థినికి మొండి చేయి చూపించారు. తల్లికి వందనం పథకం కింద ఎందుకు నగదు రాలేదని సచివాలయానికి వెళ్లి ఆరా తీస్తే ఆదాయ ధ్రువీకరణ పత్రం లేదని ఒకసారి, డేటా లేదని మరోసారి సిబ్బంది తెలిపారు. దీంతో విద్యార్థిని దేవీప్రసన్న సోమవారం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తనకు తల్లికి వందనం పథకం కింద సాయం అందించాలని కోరారు.

ఎమ్మెల్యే సిఫార్సులకే ప్రాధాన్యం

అన్యాయానికి గురయ్యామంటూ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ల ఆవేదన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సచివాలయం ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలకు తూట్లు పొడిచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా పశుసంవర్ధక అసిస్టెంట్ల బదిలీల్లో జిల్లా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే వాదనలు తెరపైకి వస్తున్నాయి. బదిలీ నిబంధనలకు సంబంధించిన మార్గదర్శకాలను పక్కన పెట్టి స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు, లంచాలు ఇచ్చుకున్న వారికి కోరుకున్న ప్రదేశానికి బదిలీ చేసినట్లు బాధిత పశుసంవర్ధక అసిస్టెంట్లు ఆవేదన చెందుతున్నారు. బదిలీల్లో అన్యాయానికి గురైన పశుసంవర్ధక అసిస్టెంట్లు సోమవారం స్థానిక కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బదిలీ నిబంధనలను అధికారులు తుంగలో తొక్కారని ఆరోపించారు. కురుపాం మండలం కిచ్చాడలో పనిచేస్తున్న పశుసంవర్ధక అసిస్టెంట్‌ను జామి మండలానికి బదిలీ చేశారు. సాలూరు మండలం కరాసువలస పశుసంవర్ధక అసిస్టెంట్‌ను కూడా జామి మండలానికి బదిలీ చేశారు. తాము కోరుకున్న మూడు మండలాల్లో ఎక్కడా ఇవ్వకుండా పక్క జిల్లాకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాభర్తలు దగ్గరలో వుండాలన్న నిబంధనలు, అనారోగ్యంతో బాధపడుతున్న, చిన్న పిల్లలున్న మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిబంధనలు ఉన్నాయి. అయితే జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు, లంచాలు ఇచ్చుకున్న వారికి వారు కోరుకున్న చోటకు బదిలీ చేశారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సానుకూలంగా స్పందించలేదు. అన్యాయానికి గురైన పశు సంవర్ధక అసిస్టెంట్లతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ బదిలీ నిబంధనలను తుంగలో తొక్కి ఎమ్మెల్యే సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమని చెప్పారు. నిబంధనల ప్రకారం జిల్లా అధికారులు రీ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పశుసంర్ధకశాఖ అసిసెంట్లు

ఆహ్లాదకరమైన వాతావరణంలో మెగా పిటిఎం

ఘనంగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా ఈనెల 10న జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీట్ 2.0ను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఇందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు, ప్రముఖులు తప్పని సరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెల్పి చెప్పారు. మెగా పేరెంట్ టీచర్ మీట్ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణ కోసం ప్రతి కళాశాల, పాఠశాలల్లో 16 రకాల కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, వాటి సారథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రధానం చేయాలని, కావున వాటిని ముందుగా సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. తల్లి ప్రాముఖ్యతను తెలియజేసేలా తల్లికి వందనం కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమ నిర్వహణతో పాఠశాల ప్రతిష్ట మరింత పెరగాలని, విద్యార్థులు స్ఫూర్తి చెందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఇఒ బి.రాజ్ కుమార్, ఎడి పి.రమాదేవి, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, డిఇవిఒ వై.నాగేశ్వరరావు, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్.మన్మధరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంఇఒలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఈనెల 10న తలపెట్టిన మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని అన్ని మేనేజ్మెంట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల్లో ఏర్పాటు చేసిన వివిధ కమిటీల ద్వారా సమావేశానికి తగిన పూర్తి ఏర్పాట్లు చేయాలని, ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు, గిరిజనులు

ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్ ఇవ్వాల్సిందే

విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాల్సిందేనని కోరుతూ సోమవారం స్థానిక విద్యుత్ శాఖ డిఇఇ కార్యాలయం ముందు ఎన్‌కె రాజపురం దళితులు, మల్లమ్మగూడ గిరిజనులు కలిసి ధర్నా చేపట్టారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అని వేలల్లో బిల్లులు ఇస్తున్నారన్నారు. బిల్లులు కట్టకపోతే వెంటనే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని విద్యుత్ సిబ్బంది దౌర్జన్యానికి దిగడం సరికాదన్నారు. గిరిజనులు, దళితులంటే చిన్నచూపా అని ప్రశ్నించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలించేంత వరకూ విద్యుత్ నిలుపుదల ఎవరికీ చేయొద్దని కోరారు. ఇందుకు విద్యుత్ శాఖ అధికారులు కూడా అంగీకరించారు. వీరికి మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, దళిత సంఘ నాయకులు బత్తిని మోహన్, రవి తదితరులు ఉన్నారు

బంగారు కుటుంబం మ్యాపింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

బంగారు కుటుంబం మ్యాపింగ్‌లో మార్గదర్శులు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. బంగారు కుటుంబం - మార్గదర్శి, పిఎం సూర్య ఘర్ తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది మార్గదర్శులు మొత్తం మండలాన్ని దత్తత తీసుకుంటున్నట్లు వెబ్ సైట్‌లో చూపిస్తున్నారని, దీనిపై ప్రత్యేక దష్టి సారించి జాగ్రత్తగా మ్యాపింగ్ చేయాలని సూచించారు. సంబంధిత వెబ్ సైట్ లో జిల్లా, నియోజక వర్గం, మండలం, గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం ఎంపిక చేసుకుని సచివాలయం పరిధిలో గల కుటుంబాలను మాత్రమే ఎంపిక చేయాలన్నారు. పిఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 312 గృహాలకు కనెక్షన్లు ఇచ్చామని, మరిన్ని కనెక్షన్లు పెంచేందుకు కృషి చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభమై ందని కాలువల్లో నీటి పారుదలకు ఆటంకం లేకుండా చూడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పెరగకుండా ప్రజలంతా పారిశుధ్యం పాటించి సహకరించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భద్రగిరి సిహెచ్‌సి వద్ద ఒపి కోసం క్యూలో నిల్చొన్న రోగులు

క్యూ కట్టిన రోగులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. రోగుల తాకిడితో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇందులో భాగంగా స్థానిక సిహెచ్‌సిలో సోమవారం ఒపి 200 వరకు నమోదైంది. రోగుల తాకిడి పెరగడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు వైద్యం పొందుతున్నారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

నియోజకవర్గ వైసిపి విస్తృత సమావేశంలో జెడ్పి చైర్మన్ మజ్జి, మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -సాలూరు

రాష్ట్రంలో రానున్నది వైసిపి ప్రభుత్వమేనని, రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అధ్యక్షతన నిర్వహించిన వైసిపి సాలూరు నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి హయాంలో వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల తెలియకుండానే నష్టం వాటిల్లిందని చెప్పారు. భవిష్యత్తులో పార్టీ కార్యకర్తల భాగస్వామ్యంతోనే ప్రభుత్వం నడుస్తుందని చెప్పారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ త్రికరణ శుద్ధితో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి నిలువునా మోసం చేశారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వంలో తప్పు జరిగితే ప్రశ్నిస్తానని, పోరాడతానని బీరాలు పలికిన పవన్ కళ్యాణ్ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. పవన్ కళ్యాణ్ నిజంగా నిలదీస్తారని, పోరాడుతారని ప్రజలు నమ్మి ఓటు వేశారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీల అమలుపై పవన్ కళ్యాణ్ ఎందుకు పోరాడడం లేదన్నారు. యువకులు, విద్యార్థులు సినిమా హీరో మోజులో పడి మోసం పోవద్దని కోరారు. జిల్లా మంత్రి సంధ్యారాణి జిల్లాలో గాని, నియోజకవర్గంలో గాని చేసిన అభివృద్ధి చెప్పుకోలేక రాజన్నదొరను ఏమీ విమర్శించలేక పదేపదే మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డిని తీవ్ర పదజాలంతో విమర్శిస్తున్నారని చెప్పారు .జగన్ మోహన్‌రెడ్డిని విమర్శిస్తే ఆకాశంపై ఉమ్మేసినట్లేనని అన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధి పై, ఇచ్చిన హామీల అమలు పై దృష్టి సారించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రుల సంతకాలకు విలువ లేదని రుజువయిందన్నారు. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో పింఛను తీసుకుంటూ మరణించిన భర్తల స్థానంలో వారి భార్యలకు వెంటనే పింఛను మంజూరు చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు జీవో ఇచ్చారని, అది ఇప్పటికీ అమలు కాలేదని చెప్పారు. పి4 విధానంలో భాగంగా 264పేద కుటుంబాలను దత్తత తీసుకుంటానని మంత్రి శ్రీనివాసరావు చెప్పడం చూస్తుంటే మంత్రి అయిన ఏడాది కాలంలోనే ధనవంతుడయ్యారని రుజువైందని చెప్పారు.

ఇచ్చిన హామీల సంగతి చూడండి మంత్రి గారూ: రాజన్నదొర

గత ఎన్నికల్లో ఊదరా తిరిగి ప్రజలకు ఇచ్చిన హామీల పరిష్కారానికి మంత్రి సంధ్యారాణి చర్యలు తీసుకోవాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. మంత్రిగా ఆమె వుంటూ అభివృద్ధి పనులు ఏమీ చేయలేదని తనను ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులు చెప్పాలని డిమాండ్ చేశారు. జీగిరాం జూట్ మిల్లు, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ, షెడ్యూల్ గ్రామాల ప్రకటన, గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి, పట్టణంలో ఆటోనగర్ అభివృద్ధి, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్‌ఎంల నియామకం పై ఇచ్చిన హామీల సంగతి ఏమైందని ప్రశ్నించారు. రూ.3కోట్లతో 30 గ్రామాల కు తాగునీరు సరఫరా అని చెప్పారని, అది ఎంతవరకు అమలైందని నిలదీశారు. తాను ఎప్పుడూ హామీ లివ్వలేదని,ఇస్తే మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. ఎంపీ డాక్టర్ తనూజ రాణి మాట్లాడుతూ టిడిపి కూటమి పార్టీలు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాయని చెప్పారు. ప్రజలు ఏడాది కాలంలో వాస్తవాలు గ్రహించారని చెప్పారు. మంత్రి సంధ్యారాణి అవగాహన లేకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఆరోపించారు. పెద్ద నేతలపై వ్యక్తిగత విమర్శలు చేసేనంత మాత్రాన పెద్ద నాయకులు అయిపోరని చెప్పారు. మహిళలకు రాష్ట్రమంతా ఉచిత బస్సు ప్రయాణమని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పితే మంత్రి సంధ్యారాణి జిల్లా వరకే పరిమితమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు జరిగినప్పుడే సుపరిపాలన అవుతుందని తనూజారాణి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్తు రాజు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతోనే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు పరిశీలకులు బి.ప్రసాద్, సీనియర్ నాయకులు మావుడి రంగు నాయుడు, వాసు నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, నాయకులు డోల బాబ్జీ , పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పి-4 సర్వేను పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

పి-4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం భామిని మండలానికి సంబంధించి పి-4 సర్వేలో భాగంగా మార్గదర్శకులను ఎంపిక చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి ఒక మార్గదర్శిని గుర్తించాలన్నారు. ఒక మార్గదర్శి 1 నుంచి 10 కుటుంబాల వరకు దత్తత తీసుకోవచ్చన్నారు. దత్తత తీసుకున్న కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చడానికి ప్రయత్నించాలన్నారు. సమావేశంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఇఇ కుమార్ ఇతర అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ నాగభూషణం

స్వర్ణాంధ్ర యాప్‌లు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని స్వర్ణాంధ్ర పంచాయతీల యాప్‌లను డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణం సోమవారం పరిశీలించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాటి వివరాలను కంప్యూటర్ ద్వారా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒఎస్‌ఆర్‌డి కెకె కుమార్ వర్మ వివిధ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రమాదాల బారి నుంచి కాపాడండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కల్వర్టు నిర్మించి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జనసేన నాయకుడు గూనాన నరేష్ మాట్లాడుతూ పట్టణంలోని 25, 26, వార్డులకు సంబంధించి వేమకోటి వారి వీధి ముందర కాలువపై ఉన్న కల్వర్టు పలకలు విరిగి కాలువలో కూరుకుపోయి మరమ్మతులకు గురయ్యాయన్నారు. దీనివల్ల వాడుక, వర్షపు నీరు కాలువల్లో వెళ్లేందుకు అవకాశం లేక రోడ్లపైకి వస్తుందని, దీంతో అయా వార్డులకు సంబంధించిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా స్కూల్ పిల్లలు వెళ్లేందుకు అవకాశం లేకుండా ఉందని, యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మించి, పలకలు వేయాలని కోరారు. కార్యక్రమంలో బాసంగి శ్రీనివాసరావు, గుడ్ల హరికృష్ణ, గణేష్, సముద్రాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిపిఒగా వెంకటనారాయణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక పట్టణ ప్రణాళిక విభాగం అధికారిగా సిహెచ్ వెంకటనారాయణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించార. గతంలో ఇక్కడ టిపిఒగా ఉన్న ప్రమీల రాణి బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో వెంకటనారాయణ రావు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లును, అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను జివిఎంసి నుంచి డిప్యూటేషన్‌పై ఈ మున్సిపాలిటీకి వచ్చానన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ సూచనలు, సలహాలను పాటిస్తూ, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీల సమన్వయంతో మున్సిపల్ పరిధిలో అనధికార, అక్రమ భవన నిర్మాణాలు, లేఅవుట్లపై దృష్టి పెట్టి మున్సిపాల్టీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పనిచేస్తానని అన్నారు..

కుట్టు మిషన్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణను ఆయన పరిశీలించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజులు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బ్యాచ్‌లో 67 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ 50 రోజుల పాటు ఉంటుందని, కావున ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ ఉన్నారు.

18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లు గా చేర్పించండి

ప్రజాశక్తి - పాలకొండ

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కర్నీ ఓటర్లుగా చేర్పించాలని తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారిని గుర్తించి ఓట్లు జాబితా నుంచి తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని కళాశాల ద్వారా జాబితాలు సేకరించి ఓటరుగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎంఎన్‌వి ప్రసాదు, ఎన్నికల డిటి శేఖరం తదితరులు ఉన్నారు.

సీతంపేటలో పశుగ్రాసవారోత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సీతంపేటలో పశువైద్యాధికారి కె.శైలజ సోమవారం పశుగ్రాసవారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం ద్వారా ప్రతి పాడి రైతుకు 10 నుంచి 50 సెంట్లు వరకు పశుగ్రాసం వేసుకోవచ్చని, ప్రభుత్వం ద్వారా రూ.32,992 అందజేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పశుదాణా కూడా సబ్సిడీ ద్వారా అందజేస్తామని, కావున ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, వెటర్నరీ అసిస్టెంట్ నరేంద్ర, పశు సంవర్ధకశాఖ సహాయకులు, గోపాలమిత్ర, పాడి రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు

అందరికీ సంక్షేమ పథకాలు : వీరేశ్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. మండలంలోని పొడిలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల గురించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి కూటమితోనే సాధ్యమని, ఏడాదిలో సూపర్ సిక్స్ పథకాలు అమలకు చేపట్టి ప్రజలకు విద్య, వైద్యం, రహదారి మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాంలో...

స్థానిక మేజర్ పంచాయతీలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించే సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొడిలో జరిగిన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్‌చంద్ర దేవ్

28వ వార్డులో చిన్నారులను ఎత్తుకొని ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్ : టిడిపితోనే సుపరిపాలన జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం 28వ వార్డులో ఆవార్డు కౌన్సిలర్ మజ్జి శశికర్‌తో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ హామీలను తెలియజేస్తూ, అందరి సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధి పదంలోకి నడిపించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామని, అతి త్వరలో రూ.83 కోట్లతో శుద్ధ జలాలను సరఫరా చేసేందుకు పనులు ప్రారంభిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను దశలవారీగా నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు.. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గుంటెడ్డి రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరి నాయుడు, పొట్నూరు జయంతి, మాజీ వైస్‌చైర్మన్ జయప్రకాష్ బాబు, కో ఆప్షన్ సభ్యులు మెరువ వెంకటరావు, గుంట క్రాంతి, టిడిపి నాయకులు సారికి గణేష్, డాక్టర్ భాను ప్రసాద్, భూరి కృష్ణ, గౌరీ శంకర్, పత్తిగిల్లి సత్తి, కృష్ణం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర : సిఐటియు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మధ్యాహ్న భోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుందని, అందులో భాగంగా సామూహిక వంటశాలల పేరుతో మండలానికి రెండు చోట్ల కిచెన్లు ఏర్పాటు చేసి ప్రైవేట్ సంస్థలకు ఈపథకం నిర్వహణను అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని, ఇది విద్యార్థులకు, మధ్యాహ్నబోజన నిర్వాహకులకు తీవ్ర నష్టం చేస్తుందని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర, గరుగుబిల్లి, రావుపల్లి, కొత్తూరు, తదితర పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల మధ్యాహ్న భోజనం పథకం తీవ్ర గందరగోళంగా మారే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోగా ప్రైవేటు సంస్థల జోక్యం పెరిగి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఇదే జరిగితే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.

సమ్మె జయప్రదం చేయండి...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కార్మికులకు, ప్రజలకు మేలు చేయకపోగా తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడంలో విఫలమయ్యాయని, ఇందుకు నిరసనగా ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక, ఉద్యోగులు సార్వత్రిక సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని రమణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.రవీంద్ర, అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు రోహిణి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - పాలకొండ

పంటలకు మద్దతు ధరను అమలు చేయడంలో బిజెపి సర్కారు విఫలమైందని, మద్దతు ధరపై వ్యవసాయ జాతీయ కమిషన్ చైర్మన్ ఎంఎస్ స్వామినాధన్ సిఫార్సులను తుంగలో తొక్కిందని అభ్యుదయ రైతు కండపు ప్రసాదు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 540 రైతు సంఘాలు 11 నెలల పోరాటంలో 500 మంది రైతులను బలిగొన్నా మోదీ సర్కారు స్పందించడంలేదన్నారు. సామాన్య రైతు బ్యాంకుల వద్ద అప్పు తీసుకుంటే వాటిని ముక్కు పిండి వసూలు చేసి రైతుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడానికి ఆత్మహత్యలకు పూనుకొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బహుళ జాతి సంస్థలకు రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసి వారి విధేయతను చాటుకొన్న కేంద్రం 48 కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మిక హక్కులను హరించడం, కౌలు రైతులు, కార్మికులను హక్కులు ఉల్లంఘించిన సందర్భంగా ఈనెల 9న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఉల్లిభద్ర హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్నెస్ కేంద్రాల్లో రికార్డులు పరిశీలించి ప్రతి రోజూ నమోదవుతున్న ఒపి వివరాలు, వారికి నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, మందులు, చికిత్స తదితర వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు లభ్యతను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. దీర్ఘ కాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది అందుబాటు లో ఉంటూ ప్రజలు వెల్నెస్ కేంద్రాల్లో వైద్య సేవలు వినియోగించు కునేలా చూడాలన్నారు. గర్భిణీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలని, ప్రసవం ఆసుపత్రిలో అయితే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. కనుక ఆస్పత్రుల్లో ప్రసవం తల్లి బిడ్డ సురక్షితమని వారికి వివరించి సిబ్బందికి సూచించారు. 104 వాహనంలో మందుల లభ్యత, ఇసిజి పరికరం పనితీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్ కుమార్, సూపర్వైజర్ ప్రసాద్, రవణమ్మ, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకర్రావు ఉన్నారు.

104వాహనాన్ని పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్

గుమడంగికి పాఠశాల మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని పూడేసు పంచాయితీ గుమడంగి గిరిజన గ్రామానికి పాఠశాల మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీలార్ద్ సిహెచ్. సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ గుమడంగిలో సుమారు 48 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయని, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. వీరికి ఈ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో సుమారు పది కిలోమీటర్ల దూరంలో రహదారులేని ప్రాంతంలో కొండపై నుంచి నడుచుకొని ఎండబద్రకు వెళ్తున్నారన్నారు. దీనివల్ల ప్రతిరోజు నడిచి వెళ్లలేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కలెక్టర్, ఐటిడిఎ పిఒ ప్రత్యేక చొరవ తీసుకొని గుమ్మడంగి గ్రామానికి స్కూల్ మంజూరు చేసి గిరిజన విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, గుమ్మడంగి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో కుడ్డపల్లి, చికంబ గిరిజన గ్రామాల్లో కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివశంకర్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు టీబి ముక్తభారత్, డెంగీ మహోత్సవాలు నిర్వహించారు. అనంతరం దీనిపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జ్వరాలున్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల్లో వ్యాధులు నివారణపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా అవసరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసమ్మ కార్యదర్శి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జగన్నాథ స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రథయాత్ర మహెూత్సవంలో భాగంగా జగన్నాథ స్వామి వారి హుండీ లెక్కింపు ప్రక్రియ దేవాదాయ శాఖ ఇఒ సూర్యనారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత బస్టాండ్‌లో గల స్వామి వారి ప్రధాన ఆలయంలో ఈ ప్రక్రియ జరిగింది. దేవాదాయ శాఖ సిబ్బంది, ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్ర పాండ, శశిభూషణ పండాలు స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండి రూపంలో భక్తులు స్వామి వారికి రూ.17600 వచ్చినట్లు ఇఒ వెల్లడించారు. తొమ్మిది రోజులకు గాను రథయాత్ర సందర్భంగా స్వామివారి హుండీ ఆదాయం వచ్చిందన్నారు. దీంతో పాటు స్వామి వారి దర్శనం గురించి ఏర్పాటు చేసిన టికెట్ల రూపంలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించాలని తెలిపారు. ఈ ఏడాది స్వామి వారి రథయాత్ర ప్రక్రియ దాతలు, భక్తుల సహాయ సహకారాలతో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పూర్తి చేసినట్టు తెలిపారు.

హమాలీలకు ప్రతినెలా కూలి డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

జిల్లాలోని సివిల్ సప్లై గోదాముల్లో పని చేస్తున్న హమాలీలకు నెలవారీ పడాల్సిన కూలి డబ్బులు సక్రమంగా పడకపోవడం చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి ఎస్ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హమాలీలకు ప్రతి నెలా 10న పడాల్సిన బిల్లు నెల దాటినా పడడం లేదని, దీంతో అప్పులు చేసి బతకాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున అధికారులు హమాలీల కూలి డబ్బులు ప్రతినెలా 10వ తేదీకి వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు..

ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయ పంటలు మేలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి మనిషి ఆరోగ్యం కాపాడుకోవాలంటే ప్రకృతి వ్యవసాయ పంటలు, ప్రతి ఇంట వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ కిమిడి భూషణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను అమ్మకాలు చేపట్టారు. ఎటువంటి రసాయనిక ఎరువు లేకుండా పంటలను వినియోగించడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని అన్నారు.

బాలసదనంలో సేవా కార్యక్రమం

పార్వతీపురంటౌన్ : సేవా దృక్పథంతో చేసే కార్యక్రమాలు సామాజిక, మానవత్వ విలువలను పెంపొందించేందుకు దోహద పడుతాయని ఆర్బిఎస్కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. 18వార్డులో గల బాలసదనం లో సోమవారం ఆయన సేవా కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఐసిడిఎస్ సంరక్షణలో ఉన్న పిల్లలకు స్టీల్ వాటర్ బాటిల్స్, బియ్యం, బిస్కట్లు అందజేశారు.వారి ఆరోగ్య స్థితి గతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అనాథలు,పేదలకు నిత్యావసర వస్తు రూపంలో చేసే సాయం కొంతలో కొంత ఆదుకుంటుందని ప్రతీ ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు.

మరిపివలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని మరిపివలసలో సోమ వారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పూడిక తీతలు, నీళ్ల ట్యాంకలు శుభ్రం చేయడం, కాలువల్లో మురుగునీరు, పిచ్చి మొక్కలు తొలగించినట్టు తలెఇపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఎపిఎంగా సతీష్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వెలుగు ఎపిఎంగా సతీష్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఎపిఎంగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎపిఎం రామకృష్ణ బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సతీష్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

ఎన్ఐటి విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి)లో సీటు వచ్చింది. చదువుకొనేందుకు ఆర్థిక స్తోమత సరిపోవడం లేదు. అవకాశం మేరకు ఆర్థిక సహాయం అందించాలని సోమవారం పిజిఆర్ఎస్‌లో ఒక గిరిజన బాలిక తల్లిదండ్రులు వినతి పత్రాన్నికలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ కు అందజేసింది. జిల్లా కలెక్టర్ వినతిపత్రాన్ని పరిశీలించి అక్కడకక్కడే రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒను ఆదేశించారు. సాలూరు మండలం దత్తివలసకు చెందిన బొమ్మి వెంకటలక్ష్మి జెఇఇ మెయిన్స్‌లో 11,523 ర్యాంకును సాధించి పుదుచ్చేరి ఎన్ఐటిలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించింది. అయితే నిరుపేదలు కావడం, తమ కుమార్తె సాధించిన సీటును దక్కించుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడం దిగులు చెందారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిద్దామని ముందుకు వచ్చారు. ఈ మేరకు కలెక్టర్ స్పందించి తక్షణం ఆర్థిక సహాయాన్ని అందించారు. జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. దీంతో ఎంతో సంతోషానికి గురైన వెంకటలక్ష్మి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తూ విద్యా దానం చేశారని, ఉన్నత విద్య కొనసాగించుటకు దోహదం చేసినందుకు ఆశీర్వాదాలు మేరకు ఉన్నత స్థాయికి చేరుటకు ప్రయత్నిస్తామని అన్నారు..

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని 177 ప్రభుత్వ ప్రాథమిక, ఎంపిపి, మండల పరిషత్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం దుస్తులను పంపిణీ చేసినట్లు ఎంఇఒ బి.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు యూనిఫారం పంపిణీ చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రెండు జతలు ప్రభుత్వం పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంలు అందజేస్తున్న ఎంపిఒ చంద్రశేఖర్